ఆంధ్రజ్యోతి

గరిష్ఠం : 29.0
కనిష్ఠం : 21.0

ANDHRAJYOTHY

సూర్యాపేట

5

మంగళవారం 14 అక్టోబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.70 (311.1486)	68,397	68,397
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.40 (4.30)	1,711.21	1,711.21
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.029 (42.7687)	82,692	82,092

చికెన్ ధరలు | లైవ్ : రూ.145 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



తుంగతుర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సామేల్

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం

వర్షాకాలం ధాన్యం కొనుగోళ్లకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. అందుకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల కోసం గన్నీబ్యాగులు, కాంటాలు, ప్యాడీక్లీనర్లను సిద్ధంగా ఉంచారు. వరి కోతలు ముమ్మరం కానందున విడతల వారీగా కేంద్రాలను ప్రారంభించనున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 298 కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా 4.30లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయనున్నారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట (కలెక్టరేట్)

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 4.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లే లక్ష్యం
- 298 కేంద్రాల ద్వారా సేకరణ

జిల్లాలో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే పలు మండలాల్లో ప్రజాప్రతినిధులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు.ఈసీజన్‌లో 4.30లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించారు. కొనుగోళ్లకు అవసరమైన గన్నీ బ్యాగులు, కాంటాలు, టార్పాలిన్లు, తూర్పారపట్టే మిషన్లు సిద్ధం చేశారు. రైతులకు దొడ్డురకం గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.2,389, సాధారణ రకానికి రూ.2369 ఇవ్వనున్నారు. ఆదేవిధంగా సన్నరకం ధాన్యం విక్రయిస్తే మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటాకు రూ.500 బోనస్ అందించనున్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల విషయంలో ఏవైనా సలహాలు, సందేహాలు కలిగితే నివృత్తి కోసం కలెక్టరేట్‌లో హెల్ప్‌లైన్ కేంద్రం నెంబరు 7013133658ను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

జిల్లాలో 4.82లక్షల ఎకరాల్లో వరి సాగు

జిల్లాలో వానాకాలం సీజన్‌లో రైతులు 4.82 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. అందులో 2.63లక్షల ఎకరాల్లో సన్నరకం, 2.19లక్షల ఎకరాల్లో దొడ్డురకం సాగు చేశారు. అయితే మొత్తంగా 10.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానున్నట్లు వ్యవసాయశాఖాధికారులు అంచనా వేశారు. జిల్లాలో 4.30లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అందులో 2.36లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం, 1.94లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యం కొనుగోలుకు వస్తుందని అంచనా వేశారు.

298 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు..

వానాకాలం సీజన్ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు జిల్లా వ్యాప్తంగా 298 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నారు. అందులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 132, ఐకేపీ ఆధ్వర్యంలో 168 కొనుగోలు కేంద్రాలు, ఇతరుల ఆధ్వర్యంలో 36 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని 53 మిల్లులతో పాటు 5 గోదాంలకు తరలించనున్నారు.

సిద్ధంగా గన్నీ బ్యాగులు..

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి 1.07 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం కానున్నాయి. అయితే ప్రస్తుతానికి జిల్లాలో 50 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన గన్నీ బ్యాగులు విడతల వారీగా...

- మిగతా 8వ పేజీలో...

భారీ వర్షంతో రైతులు ఆగమాగం



తుంగతుర్తిలో తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు

తుంగతుర్తి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఆరుగాలం కష్టించి పండించిన పంట కొనుగోలు కేంద్రాలకు తేగా వర్షానికి తడిసి ముద్దవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి తీరా చేతికి వచ్చాక తడవడంతో రైతుల బాధ వర్ణణాతీతం. భారీ వర్షానికి వరి పంట చాలా ప్రాంతాల్లో నేలకు ఒరిగింది. దీంతో పాటు వరికోతలు కూడా ఇబ్బందికరంగా మారింది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

రేపటి నుంచి గాలికుంటు వ్యాధి టీకా పంపిణీ

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 15వ తేదీ నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి నవంబరు 14వ తేదీ వరకు నెల రోజుల పాటు టీకాల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. మూడు నెలలు దాటిన పశువులకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో టీకా కార్యక్రమం కోసం పశువైద్య సిబ్బందిని 43 బృందాలుగా ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని ప్రతీ గ్రామాన్ని సందర్శించి ఉచితంగా టీకాలు వేస్తారన్నారు. టీకాలు వేయించడం ద్వారా వ్యాధిని పూర్తిగా అరికట్టవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ముందస్తు జాగ్రత్తే ఔషధం

6వ పేజీలో...

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ ప్రిన్సిపల్ సెక్రటరీ స్టీఫెన్ రవీంద్ర, పాల్గొన్న అధికారులు

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర సివిల్ సప్లయ్ ప్రిన్సిపల్ సెక్రటరీ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ధాన్యం సేకరణపై వివిధ జిల్లాల్లోని అదనపు కలెక్టర్లతో పాటు ఇతర అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈసీజన్‌లో అత్యధిక పంట దిగుబడి వచ్చిందని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ కొలనుపాక సీతారామారావు మాట్లాడుతూ జిల్లాలో వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 298 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 55 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. సమావేశంలో డీఎస్‌వో మోహన్‌బాబు, సివిల్ సప్లయ్ డీఎం రాము, డీఆర్‌డీవో అప్పారావు, డీఎంవో నాగేశ్వరశర్మ, డీసీవో పద్మ, డీఏవో శ్రీధర్‌రెడ్డి, ఏపీడీలు సురేష్, నగేష్, ఏడీఎం బెనర్జీ, ఏఎస్‌వో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆస్తుల రక్షణే పోలీస్ శాఖ లక్ష్యం



బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

సూర్యాపేట క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల ఆస్తుల రక్షణే పోలీస్ శాఖ లక్ష్యమని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న 102 సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు అందజేసి, మాట్లాడారు. తప్పుడు ప్రవర్తన కలిగిన వ్యక్తులు, నేరాలకు పాల్పడే వారికి ఫ్రెండ్లీ పోలీస్ ఉండదన్నారు. సామాన్యులతో మాత్రమే ఫ్రెండ్లీ పోలీస్ ఉంటుందన్నారు. రాష్ట్రంలోనే కాకుండా జార్ఖండ్, బిహార్, ఒడిశా రాష్ట్రాల నుంచి కూడా ఫోన్లను రికవరీ చేశామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఈఏడాదిలో ఆరు విడతలుగా రూ.7.15కోట్లు విలువైన 842 వివిధ కంపెనీలకు చెందిన ఫోన్లను బాధితులకు అప్పగించామన్నారు. ఫోన్లు పొందిన వ్యక్తులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, ఎస్‌బీఐ రామారావు, ఐటీకోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలవాలి

శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ బాధితులకు అండగా నిలవాలని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన ఫిర్యాదులను స్వీకరించి వారితో మాట్లాడారు.

బాణాసంచాల విక్రయాలకు అనుమతులు తీసుకోవాలి

దీపావళి సందర్భంగా జిల్లాలో ఏర్పాటుచేసే బాణాసంచా విక్రయాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అధికారులు సూచించిన ప్రదేశాల్లోనే బాణాసంచా విక్రయాలు చేయాలన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ హెచ్చరించారు.

ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని బ్రిడ్జి పనులు

- మంత్రి హెచ్చరించినా ముందుకు సాగని పనులు : వివరాలు 6లో

దేవాదుల జలాలు తుంగతుర్తికి వచ్చేలా కృషి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సూర్యాపేటటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దేవాదుల నీటిని తుంగతుర్తి ప్రాంతానికి తీసుకువచ్చేలా ప్రభుత్వం కృషిచేస్తుందని, అందుకోసం కోసం రూ. వెయ్యి కోట్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని పౌరసరఫరాల, భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన సంగతన్ సృజన్‌అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. వానాకాలం సీజన్‌లో వరిసాగులో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు రాష్ట్రంలో 143.3లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 80లక్షల మెట్రిక్ టన్నుల దాన్యం కొనుగోలు చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. గోదావరి జలాలు సూర్యాపేట వచ్చేలా సర్వశక్తులు ఒడ్డుతున్నామన్నారు. జిల్లా అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, అందులో భాగంగా ఆరులేన్ల జాతీయ రహదారి, రైల్వేలైన్‌కు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్సారెస్పీఫేజ్‌కు ఆర్డీఆర్ ఎస్సారెస్పీ-2గా నామకరణం చేస్తామని, త్వరలో జీవో వస్తుందన్నారు. దామన్న జిల్లా కోసం అనేక త్యాగాలు చేశారని, ఎస్సారెస్పీ కాల్వల నీటి కోసం తన రక్తాన్ని చిందించారని తెలిపారు. ఆర్డీఆర్‌లేని లోటు తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతిరెడ్డి, పబ్లిక్ క్లబ్ సెక్రెటరీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొప్పుల వేణారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, తండు శ్రీనివాస్‌యాదవ్, చకిలం రాజేశ్వర్‌రావు, గుడిపాటి నర్సయ్య పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది.

కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతి ఒక్క కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని ఏఐసీసీ పరిశీలకుడు, ఒరిస్సా మాజీమంత్రి సారత్‌రౌత్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సంగతన్, సృజన్‌అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. ఇప్పటికే గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, జార్ఖండ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో పార్టీ శ్రేణుల నుంచి అభిప్రాయం సేకరించి డీసీసీ అధ్యక్షులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో డీసీసీల అధ్యక్షల నియామకానికి పార్టీశ్రేణుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తుందన్నారు. డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇటు ప్రభుత్వం అటు పార్టీ పటిష్టంగా మారే విధంగా డీసీసీ ఎన్నిక ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పోతుభాస్కర్, చకిలం రాజేశ్వర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వంగవీటి రామారావు, తండు శ్రీనివాస్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌లు అరుణ్‌కుమార్, నరేష్ సుమతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గట్టు శ్రీనివాస్, గుడిపాటి నర్సయ్య, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు, పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, వీరన్ననాయక్, తూముల సురేష్‌రావు, కోతి గోపాల్‌రెడ్డి, వెలుగు వెంకన్న, డాక్టర్ వూర రామూర్తియాదవ్, జ్యోతికర్నాకర్, కందాల వెంకట్‌రెడ్డి, వేములపల్లి వాసుదేవరావు, దండి రమేష్, కక్కిరేణి శ్రీనివాస్, అబినయ్, పిల్లలరమేష్‌నాయుడు పాల్గొన్నారు.

25న హుజూర్‌నగర్‌లో మెగా జాబ్‌మేళా

హుజూర్‌నగర్ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో తీవ్రమైన సమస్య నిరుద్యోగమేనన్నారు. ఆ నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. సింగరేణి కాలరీస్, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఈ నెల 25న మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ జాబ్‌మేళాను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఐటీ, ఫార్మా, ఈకామర్స్ ట్రేడ్, మ్యాన్‌ఫ్యాక్చరింగ్, ఐటీఈఎస్, బీపీఓ, బయోటెక్నాలజీ తదితర రంగాలకు చెందిన బయో కంపెనీలను ఈ మేళాకు ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో తన్నీరు మల్లికార్జున్‌రావు, యరగాని నాగన్న, దొంతగాని శ్రీనివాసు, సంపత్‌రెడ్డి, కుంట సైదులు, శివరామ్, గెల్లి రవికుమార్, అరుణ్‌కుమార్‌దేశ్‌ముఖ్, యండీ అజీజ్ పాషా, సుబ్బరాజు, మల్లయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి సాయం చేయాలి



ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో సాయం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న అదనపు కలెక్టర్

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి బాధ్యతగా సాయం చేయాలని అదనపు కలెక్టర్ కొలనుపాక సీతారామారావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యం లో సీపీఆర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆరోగ్య, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి ధైర్యం కల్పించడం, వారి పట్ల కరుణ చూపడం, వృత్తిపరమైన వైద్య సహాయం అందించాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థలు, కళాశాలలు, పోలీస్ అధికారులు, సిబ్బందికి, ప్రజా రవాణా శాఖ వారికి వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి ఈ నెల 17 వరకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌డీవో అప్పారావు, జిల్లా ప్రోగ్రాం అధికారులు ఆశ్రితా, వెంకటేశ్వర్లు, నాజియా, శ్రీశైలం, ఏవో సుదర్శన్‌రెడ్డి, డెమో సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

ప్రజావాణిలో ప్రజలు అందించే అర్జీలను సంబంధిత అధికారులు వేగంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కొలనుపాక సీతారామారావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించి, మాట్లాడారు. వివిధ శాఖలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిశీలించి, పరిష్కరించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో అప్పారావు, డీఈవో అశోక్, డీసీవో పద్మ, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, డీఏవో శ్రీధర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా సంక్షేమాధికారులు నర్సింహారావు, దయానందరాణి, శంకర్, శ్రీనివాసనాయక్, ఏవో సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామెర్ల వ్యాధి తీవ్రతతో పాఠశాల మూసివేత

మేళ్లచెర్వుఅక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి):పాఠశాల విద్యార్థులు కామెర్ల వ్యాధి బారిన పడుతుండటంతో స్థానిక ఆరెంజ్ ప్రాథమికోన్నత పాఠశాల యజమాన్యం వారం రోజుల పాటు స్కూల్‌కు సెలవు ప్రకటించింది. దసరా సెలవులకు ముందు ఇద్దరు, ముగ్గురిలో ఉన్న లక్షణాలు ఆ తర్వాత 30మందికి చేరడంతో వైద్యసిబ్బంది పాఠశాలలోనే వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసి చికిత్స అందిస్తున్నారు. అయితే కొంతమంది పరిస్థితి విషమంగా మారింది. వ్యాధి తీవ్రత ఎక్కువ అవుతుందనే ఉద్దేశంతో తల్లిదండ్రుల సూచన మేరకు వారం రోజుల పాటు స్కూల్‌కు సెలువులు ప్రకటించినట్లు యజమాన్యం తెలిపింది. ఈ విషయమై మండల వైద్యాధికారి సీతామహాలక్ష్మీని వివరణ కోరగా పరిస్థితి అదుపులోనే ఉందని, ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా స్కూలుకు వారం రోజులు సెలవులు ప్రకటించారని తెలిపారు. వ్యాధికి కారణంగా భావిస్తున్న నీటి శాంపిల్స్ సేకరించామన్నారు. ఆరెంజ్ పాఠశాలను మినహాయిస్తే మరే పాఠశాలలోనూ కామెర్ల వ్యాధి కేసులు నమోదు కాలేదని, గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామన్నారు.

ఆర్థిక భారం... అనారోగ్యంతో

దంపతుల బలవన్మరణం

ఐదేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్న భర్త



దంపతులు భూక్య లచ్చు, వీరమ్మ(ఫైల్)

ఆత్మకూరు(ఎస్), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు కుమారులు ఉన్నప్పటికీ వృద్ధాప్యంలో అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో ఆ దంపతులకు జీవితం భారంగా మారింది. ఎవరికీ చెప్పుకోలేక బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి సూర్యాపేట జిల్లా అత్మకూరు (ఎస్) మండలం బోట్యాతండాలో ఈ విషాదం నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బోట్యాతండాకు చెందిన భూక్య లచ్చు(65), భూక్య వీరమ్మ(60) దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె కాగా, అందరికీ వివాహాలయ్యాయి. ఇద్దరు కుమారులు గ్రామంలోనే వేర్వేరుగా ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. రెండో కుమారుడు అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. లచ్చు, వీరమ్మ దంపతులు సొంతింట్లో ఇద్దరే ఉంటున్నారు. లచ్చు ఐదేళ్లుగా పక్షవాతంతో బాధపడుతుండగా, భార్య వీరమ్మ రోజు కూలీగా పనిచేస్తోంది. రెండు ఎకరాల భూమి ఉన్నా అంతగా ఆదాయం లేకపోవడం, ఆర్థిక అవసరాల కోసం కుమారులపై ఆధారపడటాన్ని దంపతులు ఇబ్బందిగా భావించారు. పక్షవాతానికి వైద్యచికిత్సకు, ఫిజియోథెరపీ కోసం అవసరమైన డబ్బును కుమారులను అడగలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇంట్లో గడియ పెట్టుకుని తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకున్నారు. ఇరుగుపొరుగు వారు ఇంట్లో నుంచి పొగలు, కేకలు రావడంతో కిటికీలు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే వీరమ్మ మృతి చెందింది. లచ్చుకు తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. చిన్న కుమారుడు భూక్య మోహన్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

హామీలు అమలు చేసే వరకు పోరాటం ఆగదు



బాకీ కార్డులను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లింగయ్యయాదవ్

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం ఆగదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని 46వ వార్డులో పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తుందని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, పుట్టా కిశోర్‌కుమార్, జీడి భిక్షం, బండారు రాజా, ఆంగోతు భావ్‌సింగ్, సుధాకర్, రాములు, క్రిష్ణారెడ్డి, రజని, అనూష, ఉపేంద్ర, దేవేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా ఛైర్మన్‌గా రోజాశ్రీ

సూర్యాపేట టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా ఛైర్మన్‌గా జిల్లా కేంద్రానికి చెందిన న్యాయవాది పొదిల రోజాశ్రీ నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో జాతీయ ఛైర్మన్ సాయిరమేష్, రాష్ట్ర ఛైర్మన్ రామ్మోహన్, జాతీయ అడ్వైజర్ మెరుగు రాధాకృష్ణల నుంచి నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రోజాశ్రీ మాట్లాడుతూ సమాజంలో వినియోగదారుల హక్కుల భంగం వాటిల్లకుండా వినియోగదారుల హక్కులు ఎక్కడైతే అమలు కావో అక్కడ జాతీయ వినియోగదారుల పక్షాన పోరాటం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అబినందించారు.



నియామకపత్రం అందుకుంటున్న రోజాశ్రీ

ముందస్తు జాగ్రత్తే ఔషధం



- పశువుల్లో గాలికుంటు వ్యాధి
- అలసత్వం వహిస్తే మృత్యువాత పడే ప్రమాదం
- రేపటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ

రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ప్రతి ఆరు నెలలకొకసారి ఉచితంగా గాలికుం టు వ్యాధి నివారణ టీకాలను పంపిణీ చేస్తారు. ఈ క్రమంలో ఈ నెల 15 నుంచి నెల రోజుల పాటు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పంపిణీకి పశు సంవర్ధక శాఖ సిద్ధమైంది. అంటువ్యాధి అయిన ఈ వ్యాధిని సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోతే పశువులు, వాటి పాలు తాగిన దూడలు మృత్యువాత పడే ప్రమాదముంది. ఈ వ్యాధి వైరస్ ద్వారా గాలిలో వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి ప్రధానంగా పశువులు, పందులు, గొర్రెలు, మేకలు వంటి గిట్టలు కలిగిన జంతువులకు సోకుతుంది.

- (ఆంధ్రజ్యోతి-తుర్కపల్లి)

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఈ నెల 15 నుంచి నెల రోజుల పాటు పశువులకు వేయనున్నారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు ముందు జాగ్రత్త చర్యగా ఈ టీకా వేయించాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. 2019 పశుగణన లెక్కల ప్రకారం యాదాద్రిభువనగిరి జిల్లాలో మొత్తం 1,52,200 పశుపక్ష్యాదులు ఉండగా ఇందులో 54,868 ఆవులు, 1,02,332 గేదెలు ఉన్నాయి. వీటన్నిటికీ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసేందుకు జిల్లా పశు సంవర్ధక శాఖ సమాయత్తమైంది. ఇందు కోసం జిల్లాలోని భువనగిరి, రామన్నపేట, మోత్కుర్ ఏరియా ఆసుపత్రులను కలుపుకుని 31 పశువైద్యశాలలు, 41 పశువైశాల ఉపకేంద్రాల్లో ముగ్గురు ఏడీఏలు, 31 మంది పశు వైద్యాధికారులు, 50 మంది సిబ్బంది 47 బృందాలుగా గ్రామాల్లో పర్యటించి వైద్యసేవలు అందించనున్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జాతీయ పశు వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టీకాల పంపిణీ ఉంటుందని అధికారులు తెలిపారు.

గాలికుంటు వ్యాధి వ్యాప్తి ఇలా..

పశువులకు సోకే ప్రధాన వ్యాధుల్లో గాలికుంటు ఒకటి. గాలి ద్వారా వ్యాపిస్తుంది. ప్రధానంగా ఈ వ్యాధి అఫ్థో వైరస్(ఏడు విభిన్న సెరోటైప్‌లతో) ద్వారా వస్తుంది. వ్యాధి సోకిన జంతువులతో ప్రత్యక్ష సంబంధం(లాలాజలం, పాలు, వీర్యం, విసర్జన ద్వార వ్యాపిస్తుంది. కలుషితమైన వాహనాలు, పరికరాలు, దుస్తుల ద్వారా వ్యాపిస్తుంది. అంతే కాకుండా పశువులు కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల వ్యాప్తి చెందుతుంది. కలుషితమైన ఆహారం, నీరు తీసుకోకుండా రైతులు జాగ్రత తీసుకోవాలి.

ఆర్థిక ప్రభావం

గాలికుంటు వ్యాధి అరుదుగా సోకే ప్రాణాంతక వ్యాధి కాకపోయినప్పటికీ శాశ్వత ప్రభావాలు తీవ్రంగా ఉంటాయి. వ్యాధి బారినపడ్డ పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుంది. శాశ్వత కుంటితనం రావడం, దీర్ఘకాలిక పొదుగు వాపు, అబార్షన్ కావడం, గర్భం దాల్చడంలో సమస్యలు రావడం ఉంటాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతారు.

నియంత్రణ, చికిత్స ..

పశువుల నోరు, కాలిగిట్టల మధ్య ఏర్పడిన పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో శుభ్రంగా కడగాలి. తరువాత బోరోగ్లిజరిన్ పేస్ట్‌ను పుండ్ల పై రాయాలి. పెన్సిలిన్ వంటి యాంటిబయాటిక్ మందులను పశువులకు ఇవ్వాలి.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేయించాలి



ప్రతి ఆరు నెలలకు ఒకసారి టీకాను వేయిస్తే పశువులకు గాలికుంటు వ్యాధి సోకదు. నాలుగునెలల వయస్సు నిండిన దూడల నుంచి అంతకంటే ఎక్కవ వయస్సు ఉన్న పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. యాదాద్రిభువనగిరి జిల్లా వ్యాప్తంగా గాలికుంటు వ్యాధి నివారణ వైద్య కార్యక్రమం ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14 వరకు కొనసాగుతుంది. ఈ వ్యాధి సోకితే ప్రధానంగా పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుంది. పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడక ముందే జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం.

- డాక్టర్ జానయ్య, జిల్లా పశు విద్యాధికారి

నివారణ ఇలా

వ్యాధిసోకిన పశువులను వేరు చేసి బయట తిరగనివ్వొద్దు. పశువులషెడ్లు, ప్రాంగణాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. షెడ్లను సోడియం కార్బొనేట్‌సోడియం హైడ్రాక్సైడ్ వంటి క్రిమిసంహారక మందుతో శుభ్రంచేసుకోవాలి. షెడ్లలోకి బయట వ్యక్తులు రాకుండా చూసుకోవాలి.గాలికుంటు టీకాను ఏడాదికి రెండుసార్లు పశువులకు వేయించాలి.

వ్యాధి లక్షణాలు ..

గాలికుంటు వ్యాధి సోకిన పశువులు 24 గంటల్లోగా చిక్కిపోయి అల్సర్‌కు గురవుతాయి. వ్యాధి బారిన పడిన పశువుల ఉష్ణోగ్రత 104డిగ్రీల నుంచి106 డిగ్రీల వరకు ఉంటుంది. రెండు నుంచి ఆరు రోజుల వరకు జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నోరు, పెదాలు, నాలుక, చన్నులతో పాటు కాళ్ల గిట్టల మధ్య పుండ్లు వచ్చి అనతికాలంలోనే ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువులు ముడుచుకుని పడుకుంటాయి. దీని కారణంగా పశువులు మేత మేయవు, నీళ్ల సరిగా తాగవు, నెమరు వేయలేవు. నోటి నుంచి సొంగ లేక నురుగు కారుతుండడంతో పాటు పశువులు బరువు తగ్గిపోతాయి. పశువుల్లో పునరుత్పత్తి తగ్గిపోయి, చూడి పశువులు ఈరుసుకు పోయే(అబార్షన్)అవకాశం ఉంటుంది. కాళ్ల మధ్యన పుండ్లు రావడంతో సరిగా నడవలేవు.

పాల ఉత్పత్తి తగ్గడమే కాకుండా వ్యాధి నిరోధక శక్తి తగ్గి కొన్నిసార్లు పశువులు(ఎక్కువగా దూడలు)చనిపోయే అవకాశం ఉంటుంది. ముందస్తు నివారణలో భాగంగా టీకాలు వేయించడమే ఉత్తమమని పశువైద్యాధికారులు తెలిపారు. వ్యాధి సోకిన పశువుల పాలను తాగిన దూడలు చనిపోయే అవకాశముంది.

పాఠశాల బస్సుకు తప్పిన ప్రమాదం



ప్రైవేట్ స్కూల్ బస్సును ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీయిస్తున్న గ్రామస్థులు

మునగాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చెరువు కట్ట మీదుగా వెళుతున్న ప్రైవేటు పాఠశాల బస్సుకు ప్రమాదం తప్పింది. సోమవారం సూర్యాపేట జిల్లా మునగాల మండలం నేలమర్రి గ్రామం సమీపంలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చివ్వెంల మండలం వల్లభాపురం గ్రామం సమీపంలో ఉన్న సెయింట్ పౌల్స్ హైస్కూల్ బస్సు సోమవారం ఉదయం 7 గంటలకు అదే మండలం గుంజలూరు గ్రామంలో 15మంది విద్యార్థులను ఎక్కించుకుని బయలుదేరింది. మునగాల మండలం నేలమర్రిలో మరికొందరు విద్యార్థులను ఎక్కించుకునేందుకు వస్తున్న క్రమంలో గ్రామ సమీపంలో ఉన్న చెరువు కట్టపై మరో వాహనం అడ్డు వచ్చింది. దీంతో పాఠశాల బస్సును డ్రైవర్ పక్కకు తీస్తున్న క్రమంలో బస్సు రోడ్డు దిగడంతో చెరువు కట్ట మట్టి బస్సు టైర్ల కింద కుంగింది. దీంతో బస్సు చెరువు కట్టపై దిగబడి ఆగింది. దీంతో అప్రమత్తమైన బస్సు డ్రైవర్ వెంటనే విద్యార్థులను దింపే ప్రయత్నం చేశాడు. విషయం తెసుకున్న గ్రామస్థులు వెంటనే బస్సు వద్దకు చేరుకుని విద్యార్థులను బస్సు నుంచి కిందికి దింపారు. బస్సు అదుపు తప్పిందన్న సమాచారం తెలియడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఎక్స్‌కవేటర్ సాయంతో చెరువు కట్టపై దిగబడిన బస్సును బయటకి తీశారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

కోదాడరూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కూచిపూడి గ్రామంలో నెల రోజుల ముందే ఈనిన పంటను వివిధ కంపెనీలకు చెందిన డీలర్లు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, డీలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వ్యాపారులు, ఎరువుల డీలర్లు రైతులకు నష్టపరిహారం ఇచ్చేందుకు మొదట ససేమిరా అన్నారు. సాగు సమయంలో జాగ్రత్తలు తీసుకోక పోవడంతో ఈనడం, బెరుకులు వస్తాయని వాదించారు. దీంతో రైతులు, వ్యాపారుల మధ్య ఘర్షణ నెలకొంది. ఆగ్రహంతో వ్యాపారుల కారును రైతులు స్వాధీనం చేసుకున్నారు. వెంటనే వ్యాపారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు చేరుకుని రైతులు, వ్యాపారులతో చర్చించారు. పూర్తిస్థాయిలో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.5 వేలు, పాక్షికంగా దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.2 వేల ఇచ్చేందుకు వ్యాపారులు అంగీకరించారు. అయితే వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేసిన రైతులకు మాత్రమే ఇస్తామనడంతో మళ్లీ వివాదం మొదలైంది. గ్రామంలో 100 నుంచి 150 ఎకరాల్లో పంట నష్టపోతే కొందరికే ఇవ్వడం ఏంటని నిలదీశారు. అనంతరం రైతుల నుంచి కారును పోలీసులు వ్యాపారులకు అప్పగించారు. అనంతరం వ్యాపారులు, పోలీసులు వెళ్లిపోయారు.

పెరిగిన బాలాజీనాయక్ బాధితుల సంఖ్య



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాలాజీనాయక్ బాధితులు

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : అధికవడ్డీ పేరుతో ఏజెంట్లను పెట్టుకుని ప్రజల వద్ద నుంచి రూ.కోట్లు కొల్లగొట్టిన బాలాజీనాయక్ బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం వద్దిపట్ల గ్రామపంచాయతీలోని పలుగుతండాకు చెందిన బాలాజీనాయక్‌ను పోలీసులు మూడురోజుల కిందట రిమాండ్‌కు తరలించారు. అయితే పోలీసులు తడి ఆస్తులు జప్తు చేసి కోర్టు ద్వారానే న్యాయం చేస్తామని ప్రకటించడంతో బాధితులు రెండు రోజులుగా తమ వద్ద అప్పు ఇచ్చిన ఆధారాలతో గుడిపల్లి స్టేషన్‌కు క్యూ కట్టారు. రెండు రోజులుగా బాధితుల సంఖ్య అంతకంతకూ పెరుగుతూనే ఉంది. ఆదివారం 72 మంది బాలాజీనాయక్ బాధితులు ఫిర్యాదులు చేయగా, సోమవారం 112మంది బాధితులు ఫిర్యాదు చేసినట్లు గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపారు. వీరిలో కొందరికి మాత్రమే బాలాజీ నేరుగా ప్రామిసరీ నోట్లు, ఖాళీ చెక్కులు రాసి ఇవ్వగా ఎక్కువమందికి మాత్రం ఏజెంట్లే ప్రామిసరీ నోట్లు రాసి ఇచ్చినట్లు తెలుస్తోంది. దేవరకొండ ఏఎస్పీ మౌనిక సోమవారం ఉదయం నుంచి గుడిపల్లి స్టేషన్‌లోనే ఉండి బాధితుల ఫిర్యాదుల వివరాలను పరిశీలించారు. కొందరు బాలాజీనాయక్‌పై ఫిర్యాదులు చేయగా మరికొందరు బాలాజీనాయక్ ఏజెంట్లుగా వ్యవహరించిన వారిపై ఫిర్యాదులు చేశారు. బాలాజీనాయక్ బాధితుల్లో సామాన్య ప్రజలే కాకుండా పెద్ద వ్యాపారులు, రాజకీయ నాయకులు ఉన్నట్లు సమాచారం. ఫిర్యాదులు చేస్తే సమాజంలో తమ పరువు పోతుందని, అంతేకాకుండా ఆ డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయని పోలీసులు ప్రశ్నిస్తారనే భయంతో వెనకడుగు వేస్తున్నట్లు మండలంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. బాలాజీనాయక్ ఆస్తులను పోలీసులు గుర్తించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మౌనిక మాట్లాడుతూ బాధితులు ఎవరూ అధైర్యపడవద్దని, ధైర్యంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. బాలాజీనాయక్, అతడి ఏజెంట్లపై విచారణ చేపడుతున్నామని, లావాదేవీలు గురించి ఎలాంటి విషయాలు తెలిసినా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానీ, తనకుగాని సమాచారం ఇస్తే నిజనిజాలు తేలుస్తామన్నారు.

గోవధ.. కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లక్కారం శివారులో గోవధ చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. లక్కారం గ్రామానికి చెందిన ఎస్‌కే జహంగీర్, ఎస్ లింగోటం గ్రామానికి చెందిన ఎండీ మదార్‌లు లక్కారం శివారులోని గోపనబోయిన వెంకటయ్య సమీపంలో అక్రమంగా గోవధ చేశారు. రైతులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు సీఐ తెలిపారు. గోవధ నిర్వహిస్తున్న వ్యక్తులను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆసరా పింఛన్ల పంపిణీలో చిల్లర సాకులు

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆసరా కల్పించేందుకు అమలుజేస్తున్న పింఛన్ పథకం డబ్బుల్లో రూ.16 కోత పడుతున్నాయి. ప్రభుత్వం వృద్ధులు, ఒంటరి మహిళలు రూ.2016, దివ్యాంగులకు రూ.4016లు అందిస్తోంది. అయితే చిల్లర తేవాలని లేకుంటే పింఛన్లు అందించే సిబ్బంది రూ.16 ఇవ్వడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. చిల్లర(పదహారు రూపాయలు) అడిగితే చికాకు పడుతున్నారని, వచ్చే నెలలో వేలిముద్ర పడటంలేదని, ఫేస్ రికగ్నైజేషన్ కావడంలేదని వేధిస్తున్నారని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. పింఛన్ సొమ్ముతోనే నెలంతా ఆధారమవుతోందని, తమకిచ్చే అరకొర సాయంలో కోత విధించడం తగదంటున్నారు. ఇదిలా ఉంటే లబ్దిదారులలో అనర్హులే ఉండటం, వారు రూ.16ను నిర్లక్ష్యం చేస్తున్నారు. అయితే నిజమైన లబ్దిదారులపై ఆ ప్రభావం చూపుతోంది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పరిధిలో పింఛన్లు తీసుకునే లబ్ధిదారుల సంఖ్య 10,927గా ఉంది. ఇందులో వృద్ధాప్య పింఛన్లు 3455, దివ్యాంగులు 1,434, వితంతువులు 4,923, చేనేత కార్మికులు 222, కల్లుగీత కార్మికుల 83, ఒంటరి మహిళలు 810 మంది ఉన్నారు.



ఎన్నెస్పీ క్యాంపు పోస్టాఫీసులో బారులుదీరిన లబ్ధిదారులు

తగిన చర్యలు తీసుకుంటాం



వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆసరా ఇచ్చేందుకే ప్రభుత్వం పింఛన్ అందిస్తోంది. ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తాన్ని అణా పైసతో సహా లబ్ధిదారులకు అందజేయాలి. పింఛన్ డబ్బుల్లో రూ.16 మినహాయించుకుంటే తగినచర్యలు తీసుకుంటాం. లబ్ధిదారులు తమకు వచ్చే పింఛన్‌లో రూ.16 ఇవ్వకుంటే అడిగి మరీ తీసుకోవాలి.

- గణవేణి శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

బాలిక ఆత్మహత్య

భువనగిరి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణం సీతానగర్‌కు చెందిన బాలిక(17) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఇంటర్ ఒకేషనల్ కోర్స్ పూర్తి చేసిన బాలిక ఇటీవలే స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రి ల్యాబ్‌లో విధుల్లో చేరింది. ఈక్రమంలో ఆదివారం అర్ధరాత్రి వరకు కుటుంబసభ్యులతో ఉన్న బాలిక ఇంటి పక్కనే ఉన్న శ్మశానవాటికలోని గదిలో ఉరివేసుకుంది. ఈ మేరకు సోమవారం తెల్లవారుజామున గమనించిన కుటుంబసభ్యులు పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. అయితే ఆత్మహత్య చేసుకున్న గది గోడపై చాక్‌పీస్‌తో ఆమె రాసిందని భావిస్తున్న సెల్‌ఫోన్ నెంబర్, అర్ధరాత్రి వరకు ఫోన్‌లో మాట్లాడి అనంతరం వెళ్లి ఆత్మహత్య చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈమేరకు మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు భువనగిరి పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

'ఆదర్శ' విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

సంస్థాన్ నారాయణపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులకు ఇంటికి వెళ్లి వచ్చిన విద్యార్థిని ఆదర్శ పాఠశాల భవనం మొదటి అంతస్తుపై నుంచి ఆత్మహత్యాయత్నం చేసింది. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సంస్థాన్‌నారాయణపురం మండలంలోని జనగాం గ్రామానికి చెందిన కొండూరు సాత్విక మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన సాత్వికను సోమవారం మధ్యాహ్నం తల్లిదండ్రులు పాఠశాలలో వదిలి వెళ్లటంతో తరగతి గదికి వెళ్లింది. పాఠశాలకు వచ్చిన రెండు గంటల్లోనే పాఠశాల భవనం మొదటి అంతస్తుపై నుంచి దూకటంతో కాలు విరిగింది. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు వైద్య చికిత్సల నిమిత్తం చౌటుప్పల్ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థిని సంచిలో మై డియర్ ఫ్రెండ్స్, ఫ్యామిలీ ఐ మిస్‌యూ బాయ్ బాయ్ అంటూ ఉన్న ఓ లేఖను స్వాధీనం చేసుకున్నారు. వసతి గృహంలో ఉండటం ఇష్టం లేకే విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసిందని ప్రిన్సిపాల్ దీప తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

● కోదాడలో తెగిపడిన కాలు



గాయపడిన నర్సయ్య

కోదాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధి శ్రీరంగాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి కాలు తెగిపోయింది. సీఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీరంగాపురానికి చెందిన కుర్రి నర్సయ్య వ్యవసాయ పనుల నిమిత్తం తన పొలానికి వెళ్లి గడ్డికోసుకుని తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్-విజయవాడపై కార్లు, లారీలు వస్తుండగా రహదారి వెంట నిల్చున్నాడు. ఈ క్రమంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేస్తూ నర్సయ్యను ఢీకొట్టింది. దీంతో నర్సయ్య కుడి కాలు తెగి 50 మీటర్ల దూరంలో పడినట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు నర్సయ్యను ప్రథమచికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కారు డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగినట్లు తెలిపారు. నర్సయ్య తమ్ముడు వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తున్న చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి

కేతేపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని తుంగతుర్తి గ్రామంలో మోటారు సైకిల్ పైనుంచి జారిపడి ఇరువరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తుంగతుర్తి గ్రామానికి చెందిన వీరబోయిన నాగశంకర్, జటంగి సంపత్ మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలోని మోడల్‌స్కూల్‌లో చదివి 10వ తరగతిలో ఉత్తీర్ణులయ్యారు. పాఠశాల నుంచి వారి సర్టిఫికెట్లు తీసుకునేందుకు సోమవారం ద్విచక్రవాహనంపై స్కూల్ వచ్చారు. స్కూల్‌లో పనిచూసుకుని చెరుకుపల్లి మీదుగా తుంగతుర్తి వెళ్తున్న క్రమంలో గ్రామశివారులోకి రాగానే బైక్ అదుపు తప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108సర్వీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్సఅందించి నకిరేకల్ ఏరియాఆసుపత్రికి చేర్చారు.

మహిళలపైకి దూసుకెళ్లడంతో..

బొమ్మలరామారం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో సోమవారం జరిగిన కారు ప్రమాదంలో నలుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ బుగ్గ శ్రీశైలం, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన రంగాపురం రాములు చనిపోవడంతో అతడి అంత్యక్రియలకు బంధువులు, స్థానికులు హాజరయ్యారు. అంత్యక్రియల అనంతరం మెయిన్‌రోడ్డు పక్కన ఉన్న వాటర్‌ట్యాంక్ వద్ద కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుంటున్నారు. అదే సమయంలో అంత్యక్రియలకు హాజరైన సతీష్ నిర్లక్ష్యంతో అజాగ్రత్తగా కారుతో వేగంగా మహిళలపైకి దూసుకెళ్లాడు. దీంతో మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా మునిరాబాద్‌కు చెందిన చేమంత, లక్ష్మి, ఎల్లమ్మ, స్వరూపలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాలోని ఆర్‌వీఎం ఆసుపత్రికి 108వాహనంలో తరలించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

యాదగిరిగుట్ట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆధ్యాత్మికవాడలో గుర్తుతెలియని మృతదేహాన్ని యాదగిరిగుట్ట పోలీసులు గుర్తించారు.సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు కల్యాణకట్ట వద్ద సుమారు 40 నుంచి 45 ఏళ్ల వ్యక్తి మృతదేహం కనిపించింది. శరీరంపై కుడి చేతికి బొటనవేలు మాత్రమే ఉంది. దేవస్థాన శానిటేషన్‌విభాగం అవుట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్ పాండురాజు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ తెలిపారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు(ఎస్), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ఈ నెల 15న సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏఎస్ఎం ఎడ్యుకేషన్ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. వివరాలకు సెల్ 8143539030, 9494349959 నెంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని బ్రిడ్జి పనులు

(ఆంధ్రజ్యోతి - హుజూర్‌నగర్)

నాలుగేళ్ల కిందట ప్రారంభించిన హుజూర్‌నగర్ మండలంలోని శ్రీనివాసపురం-అమరవరం గ్రామాల మధ్య బ్రిడ్జి పనులు నేటికీ పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో మట్టపల్లి మేజర్ పరిధిలో పెద్దఎత్తున పొలాల వృధా జలాలు వెళ్లే శ్రీనివాసపురం గ్రామసమీపంలో గత ప్రభుత్వం 2021 రూ.60 లక్షలతో బ్రిడ్జి పనులు ప్రారంభించింది. యాతవాకిళ్ల, అమరవరం, అంజలిపురం, హనుమంతులగూడెం గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు నిత్యం ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో తరుచూ ఈ మార్గంలో వరద పెరిగి రాకపోకలు ఇబ్బందులు ఎదురవయ్యేవి. ఈ నేపథ్యంలో చేపట్టిన బ్రిడ్జి పనులు నాలుగేళ్లయినా పూర్తికాలేదు. బ్రిడ్జి పనులు స్లాబ్ పోసి మధ్యలో వదిలేశారు. ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డు

బ్రిడ్జి నిర్మాణ సమయంలో రాకపోకల కోసం డైవర్షన్ రోడ్డు నిర్మించారు. అయితే రెండు నెలల కిందట కురిసిన భారీ వర్షాలకు డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. ఈ క్రమంలో బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించి రెండు నెలలు కావస్తోంది. అయినప్పటికీ పనులు చేపట్టలేదు. వరద సమయంలో బ్రిడ్జికి రెండువైపులా నామమాత్రంగా మొరంపోసి ద్విచక్రవాహనాలు వెళ్లేలా చదునుచేశారు. దీంతో ఈ మార్గంలో లారీలు, బస్సులు, ఇతర ట్రాక్టర్లు, వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. ఇటీవల రెండు ఆటోలు డైవర్షన్ రోడ్డు నుంచి వెళుతున్న సమయంలో పల్టీ కొట్టి పలువురికి గాయాలయ్యాయి. అదేవిధంగా కొద్దిరోజుల క్రితం అమరవరం నుంచి హుజూర్‌నగర్‌కు ధాన్యం లోడుతో వస్తున్న మినీ లారీ పల్టీ కొట్టింది. దాంతో లారీలోని ధాన్యం బస్తాలన్నీ వరద కాల్వలో పడిపోవడంతో రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ డైవర్షన్ రోడ్డు నుంచి హుజూర్‌నగర్ పట్టణంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే స్కూల్ బస్సులు ప్రయాణిస్తుంటాయి. కాగా ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం ఏళ్ల తరబడి పూర్తికాకపోవడంతో రవాణా వ్యవస్థ అస్తవ్యస్థంగా మారింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి మరిన్ని ప్రమాదాలు జరగకుండా బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తి బ్రిడ్జి, డైవర్షన్ రోడ్డుపై బోల్తాపడిన మినీవాహనం(ఫైల్)

బ్రిడ్జిని వెంటనే పూర్తిచేయాలి



అమవరం-శ్రీనివాసపురం గ్రామాల మధ్య అర్థాంతరంగా నిలిచిపోయిన బ్రిడ్జి పనులను వెంటనే పూర్తిచేయాలి. నాలుగేళ్ల కిందట బ్రిడ్జి పనులు ప్రారంభించి మధ్యలో వదిలేశారు. దాని ఫలితంగా ఆటోలు, ట్రాక్టర్లు, మినీ లారీలు డైవర్షన్ రోడ్డుపై పడిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక మందికి గాయాలయ్యాయి. అధికారులు వెంటనే స్పందించి పనులు పూర్తిచేయాలి.

ఉస్తెల శ్రీనివాసరెడ్డి, రైతు

త్వరలోనే బ్రిడ్జి పనులు పూర్తి చేస్తాం

శ్రీనివాసపురం-అమరవరం గ్రామాల మధ్య బ్రిడ్జి పనులను త్వరలోనే పూర్తిచేస్తాం. బిల్లులు రాక పనులు ఆలస్యమవుతున్నాయి. కాంట్రాక్టర్‌ను పనులు పూర్తిచేయాలని ఆదేశించా. బ్రిడ్జి పనులు పూర్తి చేసి ప్రమాదాలు నివారిస్తాం.

రమేష్‌బాబు, డీఈ, ఆర్అండ్‌బీ

దేవరకొండలో చోరీ

దేవరకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో పట్టపగలు దొంగతనం జరిగింది. కాలనీకి చెందిన సైదులు వస్త్ర దుకాణం నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇంటికి తాళం వేసి భార్య, భర్తలు సోమవారం దుకాణానికి వెళ్లారు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికిరాగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని రూ.లక్షా 10వేల నగదు అపహరణకు గురైందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు దేవరకొండ సీఐ వెంకటరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

అడ్డగూడూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): యాద్రాది భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని డి. రాపాకలో విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన అండెం నర్సిరెడ్డి పాడి గేదే మేత కోసం విడిచిపెట్టగా మేసుకుంటూ వెళ్లి సమిపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదే విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

పోలీస్ సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించాలి



డీఐజీ చౌహాన్‌కు గౌరవ వందనం చేస్తున్న పోలీసులు, చిత్రంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించి బాధితులకు న్యాయం చేయాలని మహబూబ్‌నగర్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. యూరియా కోసం చేపట్టిన ధర్నాలోపాల్గొన్న గిరిజన రైతుపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించి దుర్భాషలాడారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వాడపల్లి ఎస్ఐపై విచారించేందుకు మహబూబ్‌నగర్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు వచ్చారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి సోమవారం మిర్యాలగూడ డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించి, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం వాడపల్లి ఎస్‌హెచ్‌వో పనితీరు, ప్రవర్తనపై, సంఘటనకు దారితీసిన కారణాలు తదితర అంశాలపై అధికారులను విచారించి వివరాలను నమోదు చేసుకున్నారు. గిరిజనరైతు పట్ల ఎస్ఐ ప్రవర్తనపై వచ్చిన ఆరోపణలో వాస్త అవాస్తవాలు ఏ మేరకు ఉన్నాయన్న దానిపై సమగ్రంగా విచారించారు. అనంతరం డివిజన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలకు సంబంధించిన రికార్డులను సైతం పరిశీలించి కేసుల విచారణలో సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించాలని, నిందితులకు శిక్షపడేందుకు కావాల్సిన అనిరకాల సాక్ష్యాధారాలను సిద్ధంచేయాలని సూచించారు. నేరాలను నియంత్రించేందుకు పోలీస్‌శాఖ అమలు చేస్తున్న శాఖాపరమైన చర్యలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలన్నారు. పోలీస్‌శాఖపై ప్రజల్లో నమ్మకం కలిగేవిధంగా వ్యవహరించాలని, అవినీతి, అక్రమాలను నియంత్రించడంలో నిస్వార్థంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా కొనసాగించి గంజాయి, ఇతర అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, ఎస్పీ పర్యవేక్షణలో పెండింగ్ కేసుల విచారణ మరింతగా వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో క్రైం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించేందుకు వచ్చిన డీఐజీ చౌహాన్‌కు ఎస్పీ శరత్‌చంద్రపవార్, డీఎస్పీ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గౌరవ స్వాగతం పలికారు. కార్యక్రమంలో సీఐలు నాగభూషణం, సోమనర్సయ్య, పీఎన్డీప్రసాద్, మాడ్గులపల్లి, వేములపల్లి ఎస్ఐలు కృష్ణయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కిసాన్ మోర్చా నాయకుడు మధుసూదన్‌రెడ్డి

మాడ్గులపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ఐకేపీ సెంటర్లలో పోసిన ధాన్యం తడిసిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ఐకేపీ సెంటర్‌లో వర్షానికి తడిసిన రైతుల ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆరుగాలం కష్టించి పండించి రైతులు ధాన్యాన్ని ఐకేపీ కేంద్రానికి తరలిస్తే అకాల వర్షానికి ధాన్యం తడిసిపోవడంతో రైతులకు కన్నీళ్లే మిగిలాయన్నారు. ప్రభుత్వం వెంటనే తడిసిన ధాన్యానికి ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని అన్నారు. ఐకేపీ సెంటర్లలో వెంటనే ధాన్యానికి కాంటాలు వేసి ధాన్యాన్ని ఎగుమతి చేయాలన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం అందించి నష్టపోకుండా చూడాలన్నారు. రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదని బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి, వంగూరు రవి, బుర్రి వెంకట్‌రెడ్డి, బుర్రి కలమ్మ, బాల్నె సత్యంరెడ్డి, తెలమల్ల సైదులు పాల్గొన్నారు.


గాంధీజీ లక్ష విగ్రహాల సేకరణ

చండూరు, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ స్వర్ణోత్సవాల సందర్భంగా సోమవారం చండూరు పట్టణంలోని గాంధీజీ విద్యాలయంలో గాంధీజీ లక్ష విగ్రహాల సేకరణ కార్యక్రమాన్ని గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం, స్వదేశీ, స్వావలంబన, స్వాభిమానంతో కూడిన జీవితం సాధించే దిశగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. నేటి యువతరానికి గాంధీ ఇచ్చిన సందేశాన్ని చేరవేయడంతోపాటు సుస్థిర అభివృద్ధి, శాంతి, నైతిక విలువలు, సామాజిక సంఘీభావం బలోపేతం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్నట్లు వారు తెలిపారు. ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, విశ్వ వ్యాప్తం చేయడానికి కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి సంఘీభావంగా ఈ లక్ష విగ్రహాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు జీవీరావు, పుచ్చకాయల వెంకట్‌రెడ్డి, గొట్టిపర్తి చంద్రశేఖర్, అశోక్, పలల్లె శ్రీనివాస్‌గౌడ్, శిరంశెట్టి శ్రీధర్‌బాబు, సరికొండ వెంకన్న పాల్గొన్నారు.

బీకేఎన్‌కే సంఘ్ ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక

నల్లగొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భారత ఆహార సంస్థలో జాతీయ స్థాయిలో గుర్తింపు యూనియన్ అయిన బీకేఎన్‌కే సంఘ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గోపయ్య, కార్యదర్శిగా శ్రీకాంత్ రెడ్డిని ఎన్నుకున్నారు. యూనియన్‌కు సంబంధించి తెలంగాణ ప్రాంత సీనియర్ ఉపాధ్యక్షులు సతీష్‌రెడ్డి, సీనియర్ అదనపు కార్యదర్శి రాహుల్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. గత కార్యవర్గంలో అధ్యక్ష, కార్యదర్శులుగా పనిచేసిన శ్రీధర్, శ్రీశైలంలకు అభినందలు తెలిపారు. రాంబాబు, అరుణ్, దివ్య, రూప, కిరణ్, మధు, అజయ్, గోపి ఉన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్‌జీఎఫ్ సెక్రటరీ విమల

నాగార్జునసాగర్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ నెట్ బాల్ పోటీల్లో నల్లగొండ జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు జిల్లా నెట్ బాల్ అసోషియేషన్ కార్యదర్శి కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9, 10, 11తేదీలల్లో మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు స్టేడియంలో జరిగిన పోటీల్లో రాష్ట్రంలో 28 జిల్లాల జట్లు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎస్‌జీఎఫ్ సెక్రటరీ విమల అభినందించారు. బాలికల విభాగంలో జిల్లా జట్టు ద్వితీయ స్థానం, బాలుర విభాగంలో తృతీయ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లా వాలీబాల్ పోటీలకు..

మఠంపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్ధాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సొదసోతు హర్షిత ఈనెల 14న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగే అండర్-17 పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ వీరస్వామి తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన (ఎస్‌జీఎఫ్ఐ)అండర్-17 బాలికల విభాగంలో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని హెచ్ఎం కోరారు. ప్రతిభ చూపిన విద్యార్థి హర్షితను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

నారాయణపురం విద్యార్థుల ఎంపిక

చిలుకూరు : మండలంలోని నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జిల్లా అండర్-14 వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం కోదాడలో జరిగిన డివిజన్ స్థాయిలో అండర్-14 విభాగంలో 9వ తరగతి చదువు తున్న అశ్విని, మధు, మేఘన ప్రతిభ కనబరిచి జిల్లా జట్టులో ఎంపికైనట్లు పీడీ సీతారాంరెడ్డి తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, పాఠశాల చైర్మన్ విరూపాక్ష, పీడీ సీతారాంరెడ్డి ఉపాధ్యాయులు అభినందించారు.

చీకటి రహదారిలో..

● జాతీయ రహదారిపై వెలగని లైట్లు ● ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



కొండమల్లేపల్లిలో జాతీయ రహదారిపై లైట్లు వెలగకపోవడంతో అంధకారం

కొండమల్లేపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వెలగని లైట్లతో వాహనదారులు, పట్టణవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. జాతీయ రహదారులపై నిత్యం పెద్దసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన లైట్లు వెలుగక చీకటిలో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి-167 డివైడర్ల మధ్య లక్షలాది రూపాయలతో లైట్లు ఏర్పాటు చేశారు. అవి పది రోజులు వెలిగిన దాఖలాలు లేవు. జాతీయ రహదారిపై నిత్యం వందల కొద్దీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కొండమల్లేపల్లి చౌరస్తా నుంచి దేవరకొండ రోడ్డులోని తహసీల్దార్ కార్యాలయం వరకు డివైడర్ల మధ్య ఏర్పాటు చేసిన లైట్లు వెలగక సమారు రెండు నెలలు కావొస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని యూటర్న్ వద్ద ప్రమాదాలు చోటు చేసుకొని పలువురు వాహనదారులు గాయలపాలయ్యారు. జాతీయ రహదారి డివైడర్ల మధ్యలో చెట్లు ఏర్పాటు చేయడంతో అవి ఏపుగా పెరిగి లైట్లు వెలగక చీకటి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లైట్ల వెలిగేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

లైట్లు వెలగడం లేదు



దేవరకొండ రోడ్డు చౌరస్తా నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు సుమారు రెండు నెలలుగా లైట్లు వెలగడం లేదు. దీంతో జాతీయ రహదారి అంధకారంగా మారింది. యూటర్న్ వద్ద వాహనాలు మలిపే క్రమంలో వెలుతురు లేక చీకటి కారణంగా ప్రమాదాలు జరిగాయి. కాలినడక వెళ్లాలంటే జాతీయ రహదారి కావడంతో వాహనాలు వేగంగా వస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది.

● తోటపల్లి వెంకటయ్య, కొండమల్లేపల్లి.

రెండు నెలల నుంచి లైట్లు వెలగక..



కోదాడ: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో సెంట్రల్ లైటింగ్ లైట్లు వెలగడం లేదు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట ఖమ్మం క్రాస్‌రోడ్డు, గుడిబండ రోడ్డులో ఖమ్మం వెళ్లే రహదారిలో విజయవాడ వెళ్లే రహదారిలో వీధిలైట్లు రెండు నెలల నుంచి వెలగడం లేదు. మునిసిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో పట్టణ వాసులు చీకట్లలోనే ఉంటున్నారు. లైట్లు వెలగకపోవడంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. వెలగకపోవడంపై వివిధ పార్టీల నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పన్నులు చెల్లిస్తున్నా లైట్లు ఎందుకు వేయడం లేదని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం

మున్సిపాలిటీకి పన్ను చెల్లిస్తున్నా వీధిలైట్లు వెయ్యకపోవడంతో రాత్రిపూట వాహనాలు నడపాలంటే ఇబ్బంది పడుతున్నాం. ఖమ్మం క్రాస్ రోడ్డు నుంచి రంగాథియేటర్ వరకు వెళ్లాలంటే నానా తంటాలు పడుతున్నాం. ● ముంద్రా రవి, కోదాడ.

శివకేశవులకు విశేష పూజలు



శివాలయంలో స్పటిక లింగానికి హారతి నివేదిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి వైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారి శివాలయంలో స్పటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విష్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్పటిక మూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 15,63,056ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు.

ప్రసాదాల విక్రయశాల వద్ద గ్రిల్స్ బిగింపు



యాదగిరిగుట్ట దేవస్థానంలో చింతపండు దొంగతనం జరిగిన నేపథ్యంలో ప్రసాదాల విక్రయశాలకు గ్రిల్స్ బిగించారు. విక్రయశాల కౌంటర్లు, వాటికి సంబంధించిన ప్రధాన ద్వారంతో పాటు శివాలయం వెళ్లే దారిలో కూడా గ్రిల్స్ బిగించారు. పండగ, పర్వదినం, ఇతర సెలవు, రద్దీ రోజుల్లో ప్రధానాలయం, శివాలయం సందర్శన, ప్రసాదాల సేకరణకు భక్తులు అటు ఇటు వెళ్లేందుకు అవే గ్రిల్స్ దారికి అడ్డుగా బిగించడంతో ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పవన్‌కుమార్

నాగార్జునసాగర్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హైలాన్‌కాలనీ డీఏవీ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 10,11వ తేదీల్లో హైదరాబాద్ సఫిల్‌గూడలో డీఏవీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించి రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పవన్‌కుమార్ తెలిపారు. **అండర్-17 బాలికల విభాగం నెట్‌బాల్‌లో** అరడ్ల సహస్రరెడ్డి, ఎం. అనన్య, పి. పావని, కె. ధరణి, జి. రక్షిత, సమీనా బేగం, **బాలుర విభాగంలో...** రాఘవేంద్ర, విశాల్, జీవానంద్, అజయ్, దిలీప్, వినయ్ సాయి, శివరాం, రవి చంద్ర, **షార్ట్‌పుట్‌లో..** విశాల్ ఎంపికైనట్లు తెలిపారు. వచ్చే నెలలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్, ఎస్ఈలు రఘురాం, రామకృష్ణరెడ్డి, ఈఈ సత్యశివకుమార్, ఎస్ఏవో శిరీష, డీఏవీ ఏఆర్‌వో జీఆర్‌కే ప్రసాద్, పీఈటీ సాయి కృష్ణ తదితరులు అభినందించారు.

అక్రమ డిప్యూటేషన్లపై చర్యలు తీసుకోవాలి



నల్లగొండ డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ నల్లగొండలో సోమవారం డీఈవో భిక్షపతికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్వాలతండా, సుంకిశాలతండా, నెల్లికల్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు అక్రమంగా డిప్యూటేషన్ల పేరిట కొనసాగుతున్నారని తెలిపారు. తక్షణమే జిల్లా అధికారులు సంబంధిత డిప్యూటేషన్లపై విచారణ చేయాలన్నారు. అక్రమంగా కొనసాగుతున్న ఉపాధ్యాయులను అవసరమైన పాఠశాలలో సర్దుబాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కోరె రమేష్, సహాయ కార్యదర్శి మారుపాక కిరణ్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో చురుకుదనం, ఏకాగ్రత

భువనగిరి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో చురుకుదనం, ఏకాగ్రత, పట్టుదల పెరుగుతాయని యాదాద్రిభువనగిరి జిల్లా డీఈవో సత్యనారాయణ అన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీని సోమవారం భువనగిరిలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆసక్తిగత క్రీడలలో రాణించేందుకు ప్రయత్నించాలని, ఇందుకు పాఠశాలల వారీగా గుర్తించిన విద్యార్థులను ప్రోత్సహిస్తామని అన్నారు. పీఈటీలు ప్రతిరోజు తప్పనిసరిగా విద్యార్థులతో వ్యాయామం, క్రీడలు ఆడించాలని సూచించారు. అనంతరం ఉత్సాహంగా సాగిన పోటీలలో బాలుర విభాగంలో పోచంపల్లి (ప్రథమ), తుర్కపల్లి (ద్వితీయ) బాలికల విభాగంలో ఆలేరు (ప్రథమ), అడ్డగూడూరు (ద్వితీయ) బహుమతులు సాధించాయి. అధికారులు విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కే దశరథరెడ్డి, అధికారులు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా మూసీ నీటిమట్టం



కేతేపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టు నీటి మట్టం 644.40అడుగుల వద్ద నిలకడగా కొనసాగుతోంది. ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో రోజుల తరబడి విస్తారంగా కురిసిన వర్షాలకు పది రోజులుగా వరద నీరు వచ్చి దిగువన గల మూసీ రిజర్వాయర్‌లో చేరుతోంది. ఎగువన వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టుకు రెండు రోజులుగా రెండు వేల క్యూసెక్కులను మించడం లేదు. ఆదివారం సాయంత్రానికి 2018.50క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో సోమవారం సాయంత్రానికి మరింత తగ్గి 1711.21క్యూసెక్కులుగా నమోదైంది. ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోకు అనుగుణంగా ప్రాజెక్టు అధికారులు క్రస్టుగేట్లను ఆపరేట్ చేస్తున్నారు. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 644.40అడుగులు(4.30టీఎంసీలు)గా ఉంది.

ఆరోగ్యకర జాతి నిర్మాణంలో యువ వైద్యుల పాత్ర కీలకం



హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు జ్ఞాపికను అందజేస్తున్న ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డాక్టర్) అహంతెం శాంతాసింగ్

● హరియాణా రాష్ట్రమాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

బీబీనగర్ ఎయిమ్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆరోగ్యకరమైన జాతి నిర్మాణానికి యువ వైద్యులు అంకితం కావాల్సి ఉందని హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కోరారు. సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్‌లోని అఖిల భారతీయ వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) సముదాయాన్ని ఆయన సందర్శించారు. ఎయిమ్స్ బీబీనగర్ అధ్యాపకులు, పరిపాలనా అధికారులతో పాటు ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డాక్టర్) అహంతెం శాంతాసింగ్ ఆయనకు హృదయపూర్వక స్వాగతం పలికారు. తరువాత, ప్రొఫెసర్ (డాక్టర్) అహంతెం శాంతాసింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో కొనసాగుతున్న నిర్మాణ కార్యకలాపాలు, అందించే వివిధ విద్యా కోర్సులు, రోగులకు అందిస్తున్న వివిధ విద్యాకోర్సులు, రోగులకు అందిస్తున్న సేవలపై వివరంచారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ కరుణ, నైతికతతో కూడా వైద్యసేవలు అందించడంలో యువ వైద్యులు ముందునిలవాలని ఆయన సూచించారు. అనంతరం ఎయిమ్స్ క్యాంపస్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డాక్టర్) అహంతెం శాంతాసింగ్, డీన్ (విద్యశాస్త్రం) డాక్టర్ నితిన్ అశోక్‌జాన్, డిప్యూటీ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) డాక్టర్ బిపిన్ పి.వర్గీస్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేశ్వర్ లక్కిరెడ్డి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ విశాకజైన్, సూపరింటెండింగ్ ఇంజనీర్ డి.గోవర్ధన్, ఓఎస్డీ కమ్ పీఆర్‌వో ప్రశాంత్ ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారానికి కృషి

పెన్‌పహాడ్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యల కోసం కృషి చేస్తానని అంగన్‌వాడీ టీచర్లు హెల్పర్ల సంఘం (సీఐటీయూ అనుబంధం) జిల్లా అధ్యక్షురాలు బొలిశెట్టి భాస్కరమ్మ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సంఘం సమావేశంలో ఆమెను జిల్లా అధ్యక్షురాలుగా ఎన్నుకున్నారు. తన ఎంపికకు సహకరించిన సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

దేవాలయంలో షెడ్ ప్రారంభం

చింతలపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని ఉమామహేశ్వర అంజనేయస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన షెడ్‌ను సోమవారం ప్రారంభించారు. చైర్మన్ అంబటి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ భక్తుల సుమారు రూ.7లక్షలతో షెడ్ నిర్మించామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి, మోర్తాల సీతారెడ్డి, కాకునూరి హనీమిరెడ్డి, గురుస్వామి, వీరంరెడ్డి సుధాకర్‌రెడ్డి, శాండిల్, మహత్యం పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈవో సలీంషరీఫ్

కోదాడటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు అభిరుచి ఉన్న రంగాల్లో రాణించాలని ఎంఈవో సలీం షరీఫ్ అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ అండర్-17 పోటీల్లో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎస్‌డీ. సాధిక్ గోల్డ్‌మెడల్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైన సందర్భంగా పాఠశాలలో అభినందించారు. భవిష్యత్తులో ఒలంపిక్స్ క్రీడల్లో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి బంగారు పతకం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు డి. మార్కండేయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ విడుదల చేయాలి


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

కోదాడటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్ బిక్షం డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో జరిగిన కోదాడ డివిజన్‌స్థాయి సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, పీఆర్సీ నివేదిక, ప్రభుత్వ బడుల బలోపేతం, విద్యారంగ సమస్యలు, నాణ్యమైన విద్య, ప్రభుత్వ విధానాలపై వివరించారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు పొనుగోటి కోటయ్య, రాపర్తి రామనర్సయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, బి. సైదులు, ఎంఎస్ విద్యాసంస్థల అధినేత పందిరి నాగిరెడ్డి, హనుమంతరావు, కైలాసం వెంకటేశ్వర్లు, కొల్లు శ్రీనివాసరావు, ఎం. సత్యనారాయియణ, కె. రామారావు, ఉమామహేశ్వరరావు, ఎండి మౌలానా, ముత్తవరపు రామారావు, జెఆర్‌కే మూర్తి, డీఎస్ స్వామి, పోటు నరసింహారావు పాల్గొన్నారు.

కౌలు రైతులతో సమావేశం రేపు

హుజూర్‌నగర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్వతీ సహిత భీమలింగేశ్వస్వామి దేవాలయంలో ఈ నెల 15న ఆలయ భూములు కౌలుకు చేసుకుంటున్న రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసినట్లు ఈవో గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని దేవాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. దేవాదాయ-ధర్మాదాయ శాఖ నల్లగొండ పర్యవేక్షణాధికారి సమక్షంలో ఈ నెల 15న ఉదయం 11 గంటలకు కౌలు రైతులకు సంబంధించి సమావేశం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కౌలు రైతుల కాలపరిమితి తీరినందున కౌలు పెంపుదలపై రైతులతో సమావేశం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రస్తుతం కౌలుకు చేసుకుంటున్న రైతులు దేవాలయానికి చెల్లించాల్సిన బాకీలు చెల్లించాలన్నారు. లేనిపక్షంలో బకాయిదారులను తొలగించి బహిరంగ వేలం ద్వారా వేరే వారికి కౌలుకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

అధిక దిగుబడులు సాధించాలి

హుజూర్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు చేసి రైతులు అధిక దిగుబడులు సాధించాలని హుజూర్‌నగర్ డివిజన్ ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ప్రదీప్తి కోరారు. సోమవారం పట్టణంలో డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన రైతులను ఆయిల్ పామ్ సాగుచేస్తున్న ఖమ్మం జిల్లా సత్తుపల్లి, దమ్మపేట మండలాలకు క్షేత్ర సందర్శనకు వెళ్లారు. హుజూర్‌నగర్‌లో జెండా ఊపి రైతుల పరిశీలన యాత్రను ప్రారంభించారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దిగుబడులు సాధించి అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఆయిల్ పామ్ సాగుచేస్తున్న రైతులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హరీష్, శశికుమార్, సాయి, శ్రీరామ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భానుపురి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట పట్టణంలో 11కేవీ ఫీడర్ మరమ్మతులు, వైర్లకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించడానికి మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఆర్. సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మన్నాచర్చి, బ్రాహ్మణ కల్యాణమండపం వెనుక, రాజధాని టీస్టాల్ ఏరియా, కొత్తబస్టాండ్ ఎదురుగా, విద్యానగర్, రాంమూర్తి ఆసుపత్రి దగ్గర, ఎంఎస్ఆర్ స్కూల్ ధగ్గర, దుర్గాబాయి ఆసుపత్రి, గణేష్ చౌరస్తా, బేబీకేర్ ఆసుపత్రి దగ్గర విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

● కోదాడ రూరల్: విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ రూరల్ ఏఈ సైదా తెలిపారు. విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, రోడ్డు విస్తరణలో భాగంగా మంగళవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మండల పరిధిలోని కేఎల్ఆర్ కాలనీ, కొమరబండ గ్రామం, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మంగమ్మ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

నూతనకల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని మిర్యాల గ్రామంలో గల శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ గోరుగంటి రామచందర్‌రావు, తల్లి గోరుగంటి మంగమ్మ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని తుంగతుర్తి మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం అనారోగ్యంతో మృతి చెందిన మంగమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో నాయకులు దరిపెల్లి వీరన్న, అనంతుల శ్రీనివాస్, ఇరుగు కిరణ్, కనకటి పల్ల వెంకన్న, కనకటి నగేష్, వేల్పుల రఘు, ఎల్లయ్య, లింగమల్లు, బచ్చయ్య, తదితరులు ఉన్నారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

గరిడేపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలపై ఉద్యమించి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న ట్రేడ్ యూనియన్ నాయకులపై కేంద్ర ప్రభుత్వం, సంబంధిత శాఖాధికారుల కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సడక్ సేవక్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు చలిగంటి పుల్లయ్య అన్నారు. మండలకేంద్రంలోని పోస్టాఫీస్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన తెలిపారు. ట్రేడ్ యూనియన్ నాయకులపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. గ్రామీణ డాక్ సేవక్ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి మహదేవయ్యను విధుల నుంచి తొలగించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో గ్రామీణ తపాల ఉద్యోగులు పెండెం తిరపయ్య, షేక్ మహబూబాబాషా. ధ రావత్ శ్రీను, ప్రవీణ్, జీవన్ వనజ. శిరీషా, తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం


హుజూర్‌నగర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలను సమర్థంగా అమలుచేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు తంగెళ్ళ వెంకటచంద్రం అన్నారు. సోమవారం పట్టణంలో సంఘం రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రభుత్వాలు మహిళా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. పోక్సో నిర్భయ లాంటి చట్టాలు కూడా మహిళలను కాపాడలేకపోతున్నాయన్నారు. చిన్నారులు, విద్యార్థినులు, మహిళలపై లైంగికపరమైన దాడులు జరుగుతున్నాయన్నారు.కళాశాలల్లో ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టాలన్నారు. సమావేశంలో ఇందిరాల త్రివేణి, వెంకటమ్మ, పద్మ, ఇందిరాల లక్ష్మి, పులిచింతల లక్ష్మి, ఆదిలక్ష్మి, లింగమ్మ, వరలక్ష్మి అంజమ్మ, రమణ, సీతమ్మ పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

ప్రయాణం భయం.. భయం

● తండాలకు వెళ్లే రోడ్లవెంట కంపచెట్లు ● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


పాతదొనబండతండా నుంచి భీల్యానాయక్‌తండాకు వెళ్లే దారిలో అడ్డుగా ఉన్న కంపచెట్లు



మఠంపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దేశానికి పల్లెలే పట్టుకొమ్మలని చెప్పే ప్రభుత్వాలు అమలు చేయడంలో విఫలమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేందుకు నేటికీ సరైన రోడ్లులేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని దొనబండతండా, భీల్యానాయక్‌తండా, యాతవాకిళ్ళ, హనుమంతులగూడెం, అల్లీపురం, తుమ్మల తండా నుంచి గుర్రంబోడుతండా, మంచ్యాతండా తదితర గ్రామాలకు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగి కంపచెట్లు పెరిగాయి రోడ్డుపైకి వస్తున్నాయి. రాత్రి వేళ్లలో ఈ రహదారిపై ప్రయణించాలంటే ప్రయాణికులు భయం భయంగా వెళ్లాల్సిన పరిస్థితి. రోడ్డుకు ఇరువైపులా కంప చెట్టు దట్టంగా ఉండటంతో ఇబ్బందులు పడుతూ ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. కంపచెట్లు తొలగించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను వినవించినా పట్టించుకోవడం లేదనే విమర్శనలు ఉన్నాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డు ఇరువైపుల కంపచెట్లు తొలగించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

కంపచెట్లు తొలగించాలి



రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు ఉండటంతో ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. దీంతో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల స్థాయి అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సమస్యను గుర్తించి కంపచెట్లు తొలగించాలి.

కె. ప్రభాకర్, హనుమంతులగూడెం

శ్వాశత పరిష్కారం చూపాలి



మారుమూల తండాలకు వెళ్లే రోడ్డుకు అడ్డంగా ఉన్న కంపచెట్లను తొలగించాలి. సమస్యను సత్వరగా పరిష్కారించేలా చర్యలు తీసుకోవాలి. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేసే అధికారులు సమస్యను పరిష్కారించడంలో విఫలమవుతున్నారు. తండాలకు వెళ్లే దారిలో కంపచెట్లను తొలగించి ప్రజలకు న్యాయం చేయాలి.

● బానోతుబాబునాయక్, భీల్యానాయక్‌తండా

ఎస్సారెస్పీ కాల్వకు బీఎన్‌రెడ్డి పేరు పెట్టాలి


రామన్నగూడెం ఎస్సారెస్పీ కాల్వ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

అర్వపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ రెండో దశ కాల్వకు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి పేరు పెట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. సోమవారం జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం గ్రామం వద్ద ఉన్న 71డీబీఎం మెయిన్ శ్రీరాంసాగర్ కాల్వ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంసాగర్ రెండో దశకు మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేరు పెట్టడం తగదన్నారు. కమ్యూనిస్టు పోరాట ఫలితమే ఈ ప్రాంతానికి గోదావరి జలాలు వచ్చాయన్నారు. ఎన్నో సార్లు పార్లమెంట్‌లో శ్రీరాంసాగర్ రెండో దశ గొంతును వినిపించిన నాయకుడు భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, నాయకులు కడియం కుమార్, సిగ వెంకన్న, దేవరకొండ వెంకన్న, కొమ్ము విజయ్‌కుమార్, అబ్బులు, నరేందర్, వీరస్వామి, వెంకటేష్, బిక్షం, వీరయ్య, అవిలయ్య, లింగయ్య పాల్గొన్నారు.

తిరుమలగిరి: ఎస్సారెస్పీ ఫేజ్-2 కాల్వకు భీంరెడ్డి నర్సింహారెడ్డి పేరు పెట్టాలని సామాజిక తెలంగాణ మహాసభ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో మాట్లాడారు. బీఎన్‌రెడ్డి సూర్యాపేట జిల్లాకు ఎస్సారెస్పీ నీళ్లు అందించాలని ఎన్నో ఏళ్లుగా అవిశ్రాంత పోరాటం చేశాడని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఎస్సారెస్పీ కాలువకు మాజీమంత్రి దామోదర్‌రెడ్డి పేరు ప్రకటించడంపై పునరాలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లంల యాదగిరి, బూర్గుల ప్రభాకర్, నలుగూరి రమేష్, దుస్సా రాంమూర్తి, వనం సోమన్న, కందుకూరి ప్రవీణ్, ఖాసీం, చేను యాదగిరి పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: శ్రీరాం సాగర్ రెండో దశ కాల్వకు వీర తెలంగాణ పోరాట యోధుడు, మాజీ పార్లమెంటు సభ్యుడు భీమిరెడ్డి నరసింహారెడ్డి పేరు పెట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీరబోయిన రవియాదవ్ కోరారు. ఎస్సారెస్పీ రెండో దశ కాల్వ నిర్మాణం కోసం భీమిరెడ్డి నరసింహారెడ్డి కేంద్ర, రాష్ట్ర పాలకులతో నిర్విరామంగా పోరాటం చేసి సాధించడన్నారు. ఎస్సారెస్పీ ఫేజ్-2కు రాంరెడ్డి దామెదర్‌రెడ్డి పేరు పెట్టడం తగదన్నారు.

కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ

సూర్యాపేటటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్లుగీత కార్మికుల అభివృద్ధిని విస్మరించాయని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కల్లుగీత కార్మికుల రాష్ట్ర మహాసభలను నవంబరు 28, 29, 30 తేదీల్లో జిల్లాకేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కల్లుగీత సొసైటీలను బలోపేతం చేయాలన్నారు. వృత్తిలో ఉపాధి మెరుగు పడాలంటే చెట్లపెంపకానికి భూమి ఇవ్వాలన్నారు. నీరా తాటి ఈత, ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. కల్లుగీత కార్మికులకు పింఛన్ రూ. 4వేలు, ఎక్స్‌గ్రేషియా రూ. 10లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, నాయకులు ఎల్గూరి గోవింద్, వెంకటనర్సయ్య, గౌని వెంకన్న, బాల్నె వెంకటమల్లయ్య, రమేష్‌గౌడ్, మడ్డి అంజిబాబు, కొండ కరుణాకర్, యామగాని వెంకన్న, బిక్షం, సైదయ్య, నగేష్, కృష్ణ, జయమ్మ, జనార్ధన్, కృష్ణ, రమేష్, చంద్రయ్యరామకృష్ణ, సైదులు, పిచ్చయ్య, ఇస్తారి, వీరస్వామి, శ్రీనివాస్, శ్రీను పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిని దేశద్రోహిగా పరిగణించాలి: ఎమ్మార్పీఎస్


అదనపు కలెక్టర్ సీతారామారావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిని దేశద్రోహిగా పరిగణించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు నల్లజెండాలతో నిరసన తెలిపి, మాట్లాడారు. జస్టిస్ గవాయ్ న్యాయవాదుల వాదనలు వింటున్న సమయంలో రాకేష్‌కిశోర్ అనే వ్యక్తి తన కాలి బూట్లను తీసి విసిరే ప్రయత్నం చేయడం అనాగరిక చర్య అన్నారు. దాడికి సంబంధించి సమగ్ర విచారణ చేయించి బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చే శారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ సీతారామారావుకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి రాజు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : సామేలు


వెలిశాలలో ఉపకేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సామేలు

తుంగతుర్తి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, రైతులు పండించిన ప్రతిధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యాం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దయానందం, మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, సొసైటీ వైస్ చైర్మన్ మోడం శ్రీలత, సొసైటీ సీఈవో యాదగిరి, ఏఈఓలు జోష్న, సాయి శ్రీ, జన, ఏపీఎం అశోక్ డైరక్టర్లు కేతిరెడ్డి రవీందర్‌రెడ్డి, యాదగిరి, ఈదప్ప, మజీద్ పాల్గొన్నారు.

నూతనకల్ : రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఐకెపి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబించి మాట్లాడారు. ఈ ఖరీఫ్‌లో రైతులు పండించిన దాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్వపల్లి: పేద ప్రజలకు ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందజేయడమే ధ్యేయమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామంలో రూ.50లక్షలతో చేపట్టే ఎస్సీ కమ్యూనిటీహాల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గోదావరి జలాలతో సాగు, తాగునీరు అందజేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, పూర్ణాచంద్రారెడ్డి, గంగాదర్ శ్రీనివాస్, వేల్పుల రమేష్, కుదురుపాక ఉదయ్, జానయ్య, బైరబోయిన రామలింగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వైద్యం, విద్యపై దృష్టి సారించిందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. సోమవారం మండలంలోని వెలిశాల గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రాథమిక, ప్రాథమిక ఉపకేంద్రాలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి లాజర్, ఎమ్మార్వో హరిప్రసాద్, పల్లె డాక్టర్ మణికంఠరాజు, కాంగ్రెస్ నాయకులు నరేష్, సుంకరి జనార్ధన్, జుమిలాల్, వేణురావు, యాకయ్య, రమేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మద్దిరాల: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం మద్దిరాల మండల కేంద్రంలో ఐకేపీ ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ప్రారంబించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను రైతులు పొందాలన్నారు. దళారులను ఆశ్రయించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లోనే ధాన్యం విక్రయాలు జరపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అయేషాపర్వీనా, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఏవో అనిషారోహి, ఏపీఎం శ్రీనివాస్, నాయకులు పచ్చిపాల వెంకన్న, వల్లపు రమేష్, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మట్టిపెల్లి లింగయ్య పాల్గొన్నారు.

కుక్కల బెడద నివారించాలి

పెన్‌పహాడ్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులపాటి అన్నారం గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కోరారు. ఎంపీడీవో జానయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గుంపులు, గుంపులుగా తిరుగుతున్న కుక్కలతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలు దాడి చేసి గ్రామస్థులను గాయపరిచయన్నారు. కార్యక్రమంలో నకరికంటి వెంకన్న, మేడం రమణయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

చింతలపాలెం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పోషణమాసం కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. 33 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరిత, ఉషోదయ హెచ్‌ఎం కొండలరావు, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, మస్తాన్, బి. శైలజ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

హుజూర్‌నగర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనుములగూడేనికి చెందిన షేక్ సైదులు ఇటీవల అనారోగ్యంతో చనిపోగా అతని కుటుంబానికి పూర్వ విద్యార్థులు, స్నేహితులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. రూ.30వేలను సైదులు భార్యకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చేమకూరి నర్సింహారావు, ఉపేందర్, నాగేశ్వరరావు, మధుచారి, రమేష్, గోపయ్య, అబ్దుల్ రహీమ్, బాలసైదులు, గురవయ్య పాల్గొన్నారు.

యూరియా నమోదు బుక్స్ అందజేత

చిలుకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలుకూరు, బేతవోలు ప్రాథమిక సహకార సంఘంలో సోమవారం రైతులకు యూరియా నమోదు బుక్స్ అందజేశారు. ఏవో శ్రీదర్ మాట్లాడుతూ రైతులకు పంపిణీ చేసే ప్రతి యూరియా కట్టను ఆ బుక్‌లో నమోదు చేయన్నుట్లు తెలిపారు. నిబంధనల ప్రకారమే రైతులకు ఉన్న వ్యవసాయ పొలాలను బట్టి యూరియా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్లు అలసకాని జనార్ధన్, రవీందర్‌రెడ్డి, సీఈవోలు చిలువేరు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఈకేవైసీ పూర్తిచేసుకోవాలి

గరిడేపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల బోగస్ హాజరును అరికట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈకేవైసీని పూర్తిచేసుకోవాలని ఎంపీడీవో ఆర్. సరోజ కోరారు. మండలంలోని కీతవారిగూడెంలో జరుగుతున్న ఈకేవైసీ ప్రక్రియ విధానాన్ని సోమవారం పరిశీలించారు. ఉపాధి కూలీల హాజరు అవకతవకలను అరికట్టేందుకు ఈకేవైసీని చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 60శాతం ఈకేవైసీ నమోదు ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో సురేష్, టీఏ హారికా తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం

(5వ పేజీ తరువాయి)

సమీకరించనున్నారు. వీటితో పాటు కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులకు ఇబ్బందులు కలగకుండా, ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన తేమ కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే కాంటాలు సిద్ధం చేశారు. రైతులకు టార్పాలిన్లు కూడా అందుబాటులో ఉంచుతున్నారు.

విడతల వారీగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం

జిల్లాలో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు విడతల వారీగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం. ఇటీవలే వరి కోతలు ప్రారంభమయ్యాయి. రైతులకు ఇబ్బందులు కలగకుండా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లుచేస్తున్నాం. అవసరమైన సామాగ్రి సిద్ధం చేశాం. రైతులు 17శాతంలోపు తేమ ఉండేలా ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకరావాలి. కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలి.

కొలనుపాక సీతారామారావు, అదనపు కలెక్టర్